అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి లబ్ధి
- ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి


గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఓ వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్: అర్హతే ప్రామాణికంగా కులమతాలు, పార్టీలు, వర్గాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తూ లబ్ధి చేకూరుస్తున్నారన్నారు. మండల పరిధిలోని గణేకల్ గ్రామంలో గురువారం ఎమ్మెల్యే సాయి 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. అధికారులు, నాయకులతో కలిసి గ్రామంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే దాదాపు దాదాపు 400 ఇళ్లను సందర్శించారు. ప్రతిఒక్కరితో మాట్లాడతూ యోగక్షేమాలు అడుగుతూ ముందుకు సాగారు. వృద్ధులను పలుకరించిన ఎమ్మెల్యే... అవ్వా పింఛన్ సక్రమంగా అందుతుందా... ఇంటి వద్దకే వచ్చి ఇస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలుతోపాటు ప్రజలను నేరుగా కలుసుకుని సమస్యలు తెలుసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టి మీ ముందుకు వచ్చామని ఎమ్మెల్యే తెలిపారు. అన్ని సమాజిక వర్గాలకు ప్రయోజనం చేకూరేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేశారని సాయి ప్రసాద్‌రెడ్డి గుర్తు చేశారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. రైతులకు రైతుభరోసా, పంట నష్టపరిహారం,గ్రామాల్లోనూ వైద్య సేవలు, నాడు నేడు తో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారన్నా రు. విద్యార్థులను బడికిపంపే ఏ తల్లీ ఆర్థికంగా ఇబ్బంది పడకూడదని అమ్మఒడి, విద్యా, వసతి దీవన పథకాలను సీఎం అమలు చేస్తున్నారని వివరించారు. అవ్వాతాతలకు రూ.2750 పింఛన్ అందస్తూ అండగా నిలిచారని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ డా.మధుసూదన్, ఎంపీపీ దానమ్మ, మాజీ ఎంపీపీ పంపాపతి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, మహిళా డైరెక్టర్లు రేణుక, మంజుల, మహిళా నాయకురాళ్లు శ్రీలక్ష్మి, కల్పవల్లి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ రామలింగేశ్వరయాదవ్, ఆర్‌ఐ జయరామిరెడ్డి, ఈఓపీఆర్డీ జనార్దన్, పీఆర్ ఏఈ మాలిక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య, మండల వ్యవసాయ అధికారి పాపిరెడ్డి, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ తిప్పన్న, ఏపీఓ చంద్రశేఖర్, ఏపీఎం జనార్దన్, గణేకల్ గ్రామ నా యకులు, సర్పంచ్ బంగారమ్మ, ఎంపీటీసీ లక్ష్మి, సీనియర్ నాయకులు ధర్మయ్య, మాల్లారెడ్డి, ఉచ్చీరప్ప, పరమేష్, డీలర్లు యల్లప్ప, పంపాపతి, గిడ్డయ్య, బంగారయ్య, నాగరాజు, విరుపాక్షి, తదితరులు పాల్గొన్నారు.

గాలిమాటలను పట్టించుకోం....

ప్రతిపక్షాలు ఏదో ఒకచోట నలుగురు కూర్చొని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై విమర్శలు చేయడం సరికాదని, అలాంటి గాలిమాటలను తాము పట్టించుకోమని, ప్రజలకు జవాబుదారీగా ఉంటామని ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎవ్వరూ చేయని విధంగా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు తాము వస్తుంటే పసలేని ఆరోపణలు సమంజసం కాదన్నారు. అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎవరి ప్రమేయం లేకుండా నేరుగా పేదలకు సంక్షేమ పథకాలను అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు గెలిపించుకుందామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సాయి ప్రజలకు పిలుపునిచ్చారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కౌతాళం విద్యార్థి


లింగమూర్తిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కౌతాళం: కౌతాళం జెడ్పీ పాఠశాల విద్యార్థి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గౌరమ్మ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కె. లింగమూర్తి చిత్తూరు జిల్లా నగరిలో జరిగే అండర్14 కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యాడన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి లింగమూర్తిని హెచ్ఎంతో పాటు పీడీ ఈరన్న, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, బసవరాజ్, కళ్యాణ్ తదితరులు అభినందించారు.

16న మున్సిపల్ మార్కెట్ వేలాలు

ఆదోనిటౌన్ : ఆదోని మున్సిపాలిటీకి ఆదాయ వనరులైన ఝాన్సీలక్ష్మీభాయి కూరగాయల మార్కెట్, పశువులు, గొర్రెల సంతకు సంబంధించి బహిరంగ వేలం పాటలను ఈనెల 16వ తేదీన మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ రఘునాథ్‌రెడ్డి గురువారం తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గానూ ఈ మార్కెట్‌ల వేలం పాటలను నిర్వహిస్తున్నామన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి వేలం పాటల్లో మార్కెట్‌లను దక్కించుకున్న కాంట్రాక్టర్‌లకు సుంకం వసూలు చేసుకునేందుకు అనుమతినివ్వడం జరుగుతుందని తెలిపారు.

క్లుప్తంగా

రాఘవేంద్రుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో మూలబృందావనం

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు గురువారం భక్తులు దేశం నలుమూలల నుంచి భారీగా తరలివచ్చారు. భక్తులు ముందుగా తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు భారీగా తరలిరావడంతో మఠం పరిసరా ప్రాంతాలు రద్దీగా మారాయి.పీఠాధిపతి సుభుధేంద్రతీర్థుల ఆశీస్సులతో మూలబృందావనానికి వేకువజాము విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయులను చెక్క, వెండి, బంగారు రథోత్సవాలపై ఊరేగించారు.

శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరిన శివస్వాములు




ఆదోని అర్బన్ : శివమాలధారులు గురువారం జ్యోతిర్ముడి కట్టుకుని శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరారు. పట్టణంలోని శివాలయాల్లో గురుస్వాముల వద్ద జ్యోతిర్ముడి కట్టుకుని వెళ్లారు. అదేవిధంగా మండల పరిధిలోని వెంకటాపురం నుంచి శివస్వాములు శ్రీశైలానికి బయలుదేరి వెళ్లారు. స్థానిక ఎమ్మిగనూరు రోడ్డులోని మహీంద్రా ట్రాక్టర్ షోరూమ్ సమీపంలో దాతల సాయంతో పాదయాత్ర భక్తులకు అల్కూరు మఠం మహర్షి విజయ్‌కుమార్ అన్నదాన సత్రాన్ని ఏర్పాటు చేశారు.

కంబదహాల్‌లో 'పొలంబడి'


రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ వరప్రసాద్


పెద్దకడబూరు: మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో సర్పంచ్ దస్తగిరి ఆధ్వర్యంలో గురువారం మండల వ్యవసాయాధికారి ఎం .వరప్రసాద్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వేరుశనగ పంటను ఏఓ పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేరుశనగ పంట వేసుకున్న 35 నుంచి 40 రోజుల తరువాత పైరు 50శాతంకు పైగా పూత దశలో ఉన్నప్పుడు ఎకరానికి 200కే జీల జిప్సమ్‌ను చల్లుకోవాలన్నారు. దీనిద్వారా దిగుబడులు పెంచుకోవడంతోపాటు ఆకుమచ్చ తెగులను కూడా నివారించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు రఘువీర, రైతులు గోవిందరెడ్డి, నాగేష్, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

మేథర్ మసీదు ఏరియాలో కమిషనర్ పర్యటన


మురుగు కాల్వలను పరిశీలిస్తున్న కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ఆదోనిటౌన్ : పట్టణంలోని మేథర్ మసీదు ఏరియాలో మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి గురువారం పర్యటించారు. మురుగు కాలువను పరిశీలించారు. మసీదు ముందు, వెనక, పక్కన ఉన్న వీధి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. చెత్తచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ వేయకుండా పరిసరాల శుభ్రత పాటించాలని స్థానికులకు కమిషనర్ సూచించారు.

దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు


స్వామి వారి సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ

కౌతాళం: మండల కేంద్రం కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో గురువారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాల్ నిర్వహించారు. అంతకుముందు తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.

వలంటీర్లు బాధ్యతగా పనిచేయాలి


వలంటీర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న శేషిరెడ్డి

ఆదోని రూరల్ : వలంటీర్లు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ బాధ్యతాయుతంగా పని చేయాలని మండిగిరి మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్, వైఎస్సార్సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు, మాజీ వార్డు మెంబర్ కల్లుపోతుల సురేష్ సూచించారు. గురువారం మేజర్ పంచాయతీ మండిగిరిలోని సచివాలయం –02 పరిధిలోని 29 మంది వలంటీర్లతో గురువారం సాయంత్రం వారు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో పంచాయతీ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామని, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. వలంటీర్లకు నిర్దేశించిన 50 ఇళ్లకు ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన సంక్షేమ పథకాల వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అదేవిధంగా ఈనెల 11వ తేదీన మండిగిరి పంచాయతీ పరిధిలోని గృహసారథులు, కన్వీనర్ల సమావేశం ఉంటుందని, ఆ సమావేశానికి అన్నిరకాలుగా సిద్ధం కావాలని సూచించారు.

ప్రతి ఒక్కరూ మానవత్వంతో మెలగాలి


మజ్జీద్ నిర్మాణానికి ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పెద్దలు

కౌతాళం: సమాజంలో ప్రతి ఒక్కరూ మానవత్వంతో, సోదరభావంతో మెలగాలని ఖాదర్‌లింగస్వామి దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా అన్నారు. గురువారం స్థానిక పింజారి వీధిలో నూరానీ మజ్జీద్ నిర్మాణానికి ప్రత్యేక ప్రార్థనలు, ఫాతెహాల్ అనంతరం భూమి పూజను గ్రామ సర్పంచ్ పాల్‌దినకర్ కోఆప్షన్ మెంబర్ మాబుసాబ్, మండల కన్వీనర్ ప్రహ్లాదచారితో కలిసి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మారుతున్న కంప్యూటర్ యుగంలో అందరికి ఆధ్యాత్మికత కూడ ఎంతో అవసరం అన్నారు. మజ్జీద్ నిర్మాణాన్ని అందరు కలిసికట్టుగా ఉంటూ పూర్తి చేసుకోవాలని కోరారు. దూదెకుల సంఘం జిల్లా అధ్యక్షుడు సాయిబాబ,రిటైడ్ తహసీల్దార్ షేక్షావలి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మజ్జీద్ నిర్మాణానికి సుమారు 15సెంట్ల స్థలాన్ని తమకు ఇచ్చేలా సహకారించిన ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి ఆ కాలనీ వాసులు, మజ్జీద్ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ బుజ్జిస్వామి, ఉప సర్పంచ్ తిక్కయ్య. మాజీ సర్పంచ్ అవతారం, ఉరుకుంద ట్రస్టుబోర్డు డైరెక్టర్ వెంకోబ, జెడ్పీ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వడ్డె రామన్న, బాషా, సమద్, సత్యప్పస్వామి, రామకృష్ణ, రాజ్‌అహ్మద్ పలువురు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం


హొళగుందలో పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హొళగుంద: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల స్థానం నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. గురువారం హొళగుందలో ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జులు ఎంపీటీసీ మల్లికార్జున, ఎస్కే గిరి, వైఎస్సార్ సీపీ నాయకులు ఈశా, సింగిల్‌విండో చైర్మన్ మల్లికార్జున తదితరులు ప్రచార పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ మార్చిలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతు ఇచ్చి గెలిపించాలని కోరారు. స్థానిక ప్రభుత్వ కార్యాలయాలు, టీస్టాళ్లు, బస్టాండు, ప్రధాన కూడళ్లలో తిరిగి ఓటు అభ్యర్థించారు. నాయకులు కెంచప్ప, హెబ్బటం ఎంపీటీసీ ఉరుకుందప్ప, మరిమల్ల, రమేష్,వీరేష్,ఆనంద్,భాషాతదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆలూరు: గుట్టుగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని ఆలూరు సెబ్ పోలీసులు అరెస్ట్ చేశారు. సెబ్ సీఐ ఎర్రివెంకట్, ఎస్ఐ రాజశేఖర్ ఆలూరు పట్టణంలో గురువారం దాడులు నిర్వహించారు. కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఆలూరుకు చెందిన ఈడిగ ఉరుకుందు, కొర్రపాట్టు వరలక్ష్మిని అరెస్ట్ చేసి వారి నుంచి 150 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.6వేలు ఉంటుందని అధికారులు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

వెల్దుర్తి: స్థానిక హైవే–44పై చెరుకులపాడు క్రాస్ రోడ్డులో గురువారం ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 23 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. పంచనామా అనంతరం ఆటోను సీజ్ చేసి నిందితులు శివ, చింతలయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

శ్రీ రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు ప్రారంభం




రథోత్సవ కలశాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు, పల్లకీలో అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు ప్రభోత్సవ దృశ్యం

కోసిగి: ఆరాధ్య దైవం శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి ఉత్సవాలు గురువారం రాత్రి భక్తిశ్రద్ధల మధ్య ప్రారంభమయ్యాయి. దొరల చావిడి సమీపంలో అమ్మవారికి విశేష పూజలు చేపట్టి మూలవిరాట్‌ను పల్లకీలో కొలువుంచి మేళతాళాలు డప్పు వాయిద్యాలతో ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి ప్రతిమను ఆలయంలో కొలువుంచి ఫల, పుష్పాలు, వెండికవచ అలంకరణలు గావించి మహామంగళ హారతులతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి మూల విరాట్‌ను ప్రభోత్సవంపై కొలువుంచి ఆలయం నుంచి పాదాల చెంత వరకు లాగి తిరిగి గమ్యస్థానానికి చేర్చారు. ఊరేగింపులో శ్రీనివాస రాజు దొర, బసవరాజు దొర, చైతన్య దొర ఆలయ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

11న మహా రథోత్సవం

అమ్మవారి మహారథోత్సవం ఈనెల 11న కనుల పండువగా సాగనుంది. జిల్లా నుంచే కాక, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తాదులు తరలి రానున్నారు. అమ్మవారికి కుడుములు గుగ్గిళ్లు నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించనున్నారు. అలాగే చర్మవాధులు ఉన్నవారు మొక్కుబడిగా కేజీ పాపు ఉప్పును అమ్మవారికి సమర్పిస్తే తగ్గుతోందని ఇక్కడ భక్తులు నమ్మకం. సాయంకాలం 5గంటల నుంచి అమ్మవారి మహా రథోత్సవం భక్తుల మధ్య ఉథో ఉథో.. తాయి ఎల్లమ అంటూ ఊరేగింపు కొనసాగనుంది. భక్తులు రథోత్సవానికి నారికేలలు విసిరి మొక్కులు చెల్లించనున్నారు. ఈ మేరకు భక్తులకు అన్ని వసతలు ఏర్పాటు చేశామని ఆలయ అర్చకులు అయ్యన్న గౌడ తెలిపారు. అదేవిధంగా జాతరకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ ఎరిసావలి చెప్పారు.

పౌష్టికాహారం కిట్ల పంపిణీ


పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆదోని టౌన్ : ఆదోని పరిసర ప్రాంతాల్లోని 15 మంది క్షయవ్యాధిగ్రస్తులను స్వచ్ఛంద సంస్థ సభ్యులు దత్తత తీసుకున్నారు. ఈ మేరకు గురువారం టీబీ యూనిట్‌లో డాక్టర్ షేకున్‌బీ ఆధ్వర్యంలో ఆరు నెలలకు సరిపడే పౌష్టికాహార కిట్లను డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సత్యవతి, డాక్టర్ బాలమురళీకృష్ణ, టీబీ మెడికల్ ఆఫీసర్ ఉమాపతి చేతులమీదుగా పేద టీబీ రోగులకు పంపిణీ చేశారు. ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ పథకంలో భాగంగా కిట్లను పంపిణీ చేసినట్లు డాక్టర్లు సత్యవతి, షేకున్‌బాను తెలిపారు.

స్నేహితుడికి చేయూత

ఎమ్మిగనూరుటౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన స్నేహితుడికి కుటుంబ పోషణ ఇబ్బందిగా మారడంతో మిత్రులు చేయూతనందించారు. పట్టణానికి చెందిన శ్రీనివాసులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కష్టాల్లో ఉండటాన్ని తెలుసుకున్న 10వ తరగతి బ్యాచ్ మిత్రులు మహేష్, లక్ష్మణ్‌సాగర్, మహబుబ్‌బాష తదితరులు నిత్యావసర సరుకులు, కొంత ఆర్థిక సహాయాన్ని తమ గురువులు రామ్మోహన్‌రావు, విరూపాక్షి చేతుల మీదుగా గురువారం అందించారు. కష్టాల్లో వున్న స్నేహితుడిని ఆదుకోవడం అభినందనీయమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.తోటి మిత్రులు చరణ్, సోమశేఖర్, గౌస్, శ్రీను, రాజేష్ పాల్గొన్నారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో భూగేని చెరువులో జరుగుతున్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పనులను గురువారం వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోసిగి ప్రజలకు శాశ్వత తాగునీటి పరిష్కారం కోసం ఎమ్మెల్యే తనుయుడు వై.ధరణీధర్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇది వరకే పులికనుమ నుంచి నాకన్న చెరువు వరకు పైప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భూగేని చెరువులో ఎమ్మెల్యే ప్రత్యేక నిధులు రూ.38లక్షలతో ముళ్ల పొదలను తొలగింపు, చెరువులెవెలింగ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకులు నాడుగేని నరసింహులు, ఎంపీపీ ఈరన్న, మహంతేష్ స్వామి, నాడుగేని నాగరాజు, కాంట్రాక్టర్ బసిరెడ్డి, హాజి ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరులో వలస కూలీ మృతి

కోసిగి: మండల కేంద్రం కోసిగి ఏడవ వార్డుకు చెందిన కుమ్మరి ఈరన్న(36) గుంటూరుకు వలస వెళ్లి అక్కడ ఆకస్మికంగా బుధవారం మృతి చెందాడు. మృతిని బంధువులు తెలిపిన వివరాల మేరకు 20 రోజుల క్రితం కోసిగి నుంచి గుంటూరుకు కూలీ పనులు నిమిత్తం వలస వెళ్లి జీవనం సాగిస్తున్నాడు. ఉదయం పనులకు వెళ్లుతుండగా ఉన్నటుండి కిందకు పడిపోయి మృతి చెందినట్లు తెలిపారు. మృతికి భార్యలక్ష్మి, ఇద్దరు కుమారులు, కుమార్తె. మృతుడి సొంత గ్రామం కౌతాళం మండలం చూడి గ్రామం. అయితే భార్య లక్ష్మి పుట్టినిల్లు కోసిగి కావడంతో ఇక్కడే నివాసం ఉంటున్నాడు.

ఇష్టారాజ్యంగా వాహనాల తనిఖీ సమంజసం కాదు

ఆదోని అర్బన్ : పోలీసులు ఇష్టారాజ్యంగా వాహనాల తనిఖీ నిర్వహించడం సమంజసం కాదని ముందడుగు సంస్థ అధ్యక్షుడు దేశాయ్‌చంద్రన్న, సలహాదారుడు అడ్వకేట్ శ్రీరాములు, సభ్యులు అడ్వకేట్ రమేష్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక భీమాస్ ఫంక్షన్ హాలులో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వాహనాల తనిఖీ అంటూ పోలీసులు చేస్తున్న ఇబ్బందిని వారు తప్పుపట్టారు. ఆర్‌టీఐ చట్టం ప్రకారం ఎస్ఐ, ఆపైస్థాయి అధికారి సమక్షంలో వాహనాలు తనిఖీ చేయాల్సి ఉంటుందన్నారు. అయితే కనీసం ఎస్ఐ కూడా లేకుండా పోలీసులు ఎక్కడపడితే అక్కడ, ఎప్పుడంటే అప్పుడు వాహనాలు తనిఖీ చేపట్టడం మూలంగా ద్విచక్ర వాహన చోదకులతోపాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా పోలీసులు నియమ నిబంధనల మేరకు ప్రజలకు ఇబ్బంది కలుగకుండా వాహనాల తనిఖీ చేపట్టాలని సూచించారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్నట్లు వారు తెలిపారు.

అంతర్ రాష్ట్ర ఖోఖో పోటీల్లో కడప జట్టు విజేత


ప్రథమ స్థానం సాధించిన కడప జట్టుకు నగదు బహుమతి అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో శ్రీ రేణుక ఎల్లమ్మ జాతరను పురస్కరించుకుని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, యువనేత ధరణీధర్ రెడ్డి సహకారంతో జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ రాష్ట్ర ఖోఖో పోటీల్లో కడప జట్టు విజేతగా గెలుపొందింది. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన జట్టుల మధ్య హోరాహోరీగా ఖోఖో పోటీలు జరిగాయి. ఫైనల్ మ్యాచ్‌లో అనంతపురం జట్టుపై కడప జట్టు గెలుపొందింది. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి కడప జట్టుకు రూ. 15వేలు, ద్వితీయ బహుమతి అనంతపురం జట్టుకు రూ.10వేలు అందజేశారు. అదేవిధంగా మూడవ, నాల్గవ స్థానాల్లో నిలిచిన ఆత్మకూరు జట్టుకు రూ.5వేలు, కోసిగి జట్టుకు రూ. 3వేలు అందజేశారు. కార్యక్రమంలో ఖోఖో అసోసియేషన్ కోశాధికారి ఖలీల్ అహ్మద్, అధ్యక్షుడు నరసింహులు, కార్యదర్శి నరసింహారాజు, ఆనంద్, ఆర్గనైజర్స్ పీడీ బాలకృష్ణ, కేశవ్, దర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కబడ్డీ, వాలీబాల్ పోటీలు ప్రారంభం

కోసిగి: శ్రీ రేణుక ఎల్లమ్మ జాతరను పురస్కరించుకుని కోసిగి బాలుర ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో రాష్ట్ర స్థాయి వాలీబాల్, ఖోఖో పోటీలను శుక్రవారం వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి ప్రారంభించారు. అలాగే కోసిగి వాలీబాల్ జట్టుకు వైఎస్సార్‌సీపీ యువనేత ధరణీధర్ రెడ్డి సహకారంతో క్రీడదుస్తులను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్ సీపీ మండల నాయకులు నాడుగేని నరసింహులు, మహంతేష్ స్వామి, నాడుగేని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.